
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5

సిద్దిపేట

శుక్రవారం 30 ఆగస్టు 2024



భూంపల్లిలో పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే

కఠిన చర్యలు : కలెక్టర్

మిరుదొడ్డి, ఆగస్టు 29 : ఎవరైనా సరే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ మనుచౌదరి హెచ్చరించారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలను, మిరుదొడ్డిలోని కస్తూర్బా పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాలల్లోని మౌలిక వసతులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన వెంట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ గోవర్ధన్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, పాఠశాల ఎస్‌వో స్వర్ణలత, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

గురుకులాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకులాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, సంక్షేమ హాస్టల్లో గల బియ్యం నిల్వలను, వంటగదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో హాస్టల్ వసతులు, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, జిల్లా మేనేజర్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల

అప్రమత్తంగా ఉండాలి : సీపీ



మిరుదొడ్డిలో పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ

మిరుదొడ్డి, ఆగస్టు 29 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. గురువారం మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లోని పోలీస్‌వ్యవస్థను పటిష్టపరచడానికి వీపీవో వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. ఆమె వెంట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు కమలాకర్, పర్శరాములు,నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

సిద్దిపేట మున్సిపల్

కమిషనర్‌గా ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేటటౌన్, ఆగస్టు29: సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ఆశ్రిత్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీచేసింది. కల్వకుర్తి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై సిద్దిపేటకు రానున్నారు. గతంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రసన్నరాణి అనివార్య కారణాల వల్ల కొన్నినెలలకే ఇతర ప్రాంతానికి బదిలీ చేసుకున్నారు. ఆగస్టు 1 నుంచి ఇన్‌చార్జి కమిషనర్‌గా సిద్దిపేట మున్సిపల్‌లో విధులు నిర్వర్తిస్తున్న డీఈ ప్రేరణ కొనసాగారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

- పోలీసుల అదుపులో ఏడుగురు 7
- నాలుగు బైక్‌లు, మూడు కేజీల గంజాయి స్వాధీనం

సిద్దిపేట గ్రంథాలయం

పుస్తక భాండాగారం



సిద్దిపేటలోని జిల్లా గ్రంథాలయం

- పోటీ పరీక్షలు రాసే వారికి వరం
- మహిళలు, పిల్లల పుస్తకాల విభాగాలతో పాటు మొత్తం తొమ్మిది సెక్షన్లు
- అందుబాటులో 27,298 పుస్తకాలు
- 13 కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 29 : చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఒక్క పుస్తకం వెంటుంటే అనంత జ్ఞానం మన సొంతం. అలాంటి పుస్తకాలన్నీ సిద్దిపేటలోని వేముగంటి నర్సింహాచార్యులు గ్రంథాలయంలో కొలువుదీరాయి. పాఠకుల సౌకర్యార్థం అన్ని వసతులు, ఆధునిక హంగులతో ఎస్‌డీఎఫ్ నిధులతో జిల్లా గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. 2021 ఏప్రిల్ 5న ప్రారంభించారు. పాఠకుల అభిరుచికి అనుగుణంగా ఉమెన్ సెక్షన్, చిల్డ్రన్ , ఉర్దు, పేపర్ సెక్షన్, ఒరియేంటేషన్ రూం వంటి 9 ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం ప్రత్యేక రీడింగ్ రూమ్ ఏర్పాటు చేశారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల దినపత్రికలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయి. ప్రముఖుల రచనలు, నవలలు, చిన్నపిల్లల కథల పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అన్ని కలిపి 27,298 బుక్స్ అందుబాటులో ఉన్నాయి. పాఠకులకు అవసరమున్న పుస్తకాలను లైబ్రరీ స్టాఫ్ దృష్టికి తీసుకెళ్తే వాటిని రీడర్స్‌కు అందుబాటులో ఉంచుతారు. మొదటి అంతస్తులో 13 కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. ఈ డిజిటల్ లైబ్రరీ లో అంతర్జాతీయ స్థాయి దినపత్రికలు, జర్నల్స్, మేగజైన్స్, ఆన్‌లైన్ క్లాసులు చూసేందుకు వీలుగా వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. గ్రంథాలయానికి వచ్చేవారు ముందుగా



సభ్యత్వం తీసుకోవాలి. ఇందుకోసం పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్‌తో వివరాలు గ్రంథాలయంలో ఇస్తే శాశ్వత సభ్యత్వం ఇస్తారు. ఇప్పటి వరకు 4,957 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ఈ మెంబర్‌షిప్ ద్వారా లైబ్రరీలో కూర్చుని చదువుకోవచ్చు. కొన్ని రకాల పుస్తకాలను 14 రోజుల గడువుతో ఇంటికి తీసుకెళ్లవచ్చు. ప్రస్తుతం 250 నుంచి 300 మంది వస్తున్నారు. పోటీ పరీక్షల సమయంలో 500 వరకు లైబ్రరీకి వస్తారని గ్రంథాలయ సిబ్బంది చెబుతున్నారు. ఒక మంచి పుస్తకాన్ని మొదటిసారి చదివితే కొత్త స్నేహితుడిని పొందినట్టుంటుంది. మళ్లీ మళ్లీ చదివితే పాత మిత్రుడిని కలిసిన ఆనందం ఉంటుందంటారు. కాబట్టి మీరు కూడా లైబ్రరీకి వెళ్లిరండి మరీ...



చదువుకుంటున్న యువతులు

సద్వినియోగం చేసుకోవాలి

- కె. రాజు, లైబ్రరీయన్



ప్రస్తుతం చాలా మందికి పుస్తకం చదివే సమయం లేదు. తీరిక దొరికితే సెల్‌ఫోన్ చేతిలో పట్టుకుని టైంపాస్ చేస్తున్నారు. మంచి పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలి. పోటీ పరీక్షల సమయంలో మాములు సమయం కంటే ఎక్కువ సేపు లైబ్రరీ తెరిచి ఉంచుతున్నాం. లైబ్రరీకి వచ్చే పాఠకుల కోసం అవసరమైన పుస్తకాలను కూడా పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి అందుబాటులో ఉంచుతున్నాం.



లైబ్రరీలో చదువుకుంటున్న పాఠకులు, ఉద్యోగార్థులు

మెరుగైన వసతులు కల్పిస్తాం

- ఏవీఎస్ రాజు, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి



గ్రంథాలయానికి వచ్చేవారికి మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. టాయిలెట్స్, పార్కింగ్ సౌకర్యం, మధ్యాహ్న భోజనం వంటివి మా దృష్టికి వచ్చాయి. పాఠకులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

లైబ్రరీ చాలా బాగుంది

- ప్రియాంక, పాఠకురాలు



మాది సిద్దిపేట. స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో ఉద్యోగం కోసం చదువుకోవడానికి లైబ్రరీకి వస్తున్న. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా మహిళలకు ప్రత్యేక విభాగం ఉంది. గ్రంథాలయం కూడా చాలా బాగుంది.

సిబ్బంది సహకారం బాగుంది

- గణేష్, పాఠకుడు



మాది సిరిసిల్ల డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా.. ఏడాది నుంచి సిద్దిపేటలో రూం తీసుకుని పరీక్షకు సన్నద్ధమవుతున్న. ఈ లైబ్రరీలో నాకు అవసరయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమైన ఈ లైబ్రరీ ఎంతోగానే ఉపయోగపడుతుంది.

డిజిటల్ లైబ్రరీతో చాలా ఉపయోగం

- అనిల్, పాఠకుడు



స్టాఫ్ సెలక్షన్ పరీక్షకు సిద్ధమవుతున్న. ఇందుకోసం అవసరమున్న పుస్తకాలు ఉన్నాయి. డిజిటల్ లైబ్రరీ ద్వారా చాలా విషయాలు తెలుసుకోగలుగుతున్నాం. ఇంట్లో ఇంటర్నెట్, పుస్తకాలు అంటే ఇబ్బంది అవుతుంది. అవన్నీ ఇక్కడ అందుతున్నాయి.

గ్రంథాలయాలకు కొత్త భవనాలు కలేనా?

- ఇరుకు గదులతో పాఠకుల ఇబ్బందులు
- గజ్వేల్ నియోజకవర్గంలో మారని పరిస్థితి

గజ్వేల్, ఆగస్టు 29: విజ్ఞానాన్ని అందజేసే గ్రంథాలయాలకు కష్టాలు తప్పడం లేదు. గజ్వేల్ నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో గ్రంథాలయాల పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. పదేళ్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో గ్రంథాలయాల చరిత మారలేదు. ఫలితంగా కాంపిటేటీవ్ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు ఓ వైపు డిజిటల్ లైబ్రరీలు నిర్మిస్తున్నామని చెబుతున్నా గజ్వేల్ నియోజకవర్గంలోని గ్రంథాలయాల పరిస్థితిలో మాత్రం ఏ మార్పు కానరావడం లేదు. సాక్ష్యాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పాత మునిసిపల్ కార్యాలయంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ నిర్మాణం చేపడతామని హడావిడి చేసినప్పటికి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో పాటు పాత గ్రంథాలయ భవనం మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పాఠకులు ఇరుకు గదులు, చీకటి గదులతో ఇబ్బందులు పడుతున్నారు.

మండలాల్లోనూ ఇదే పరిస్థితి

గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు మండలాల్లోనూ గ్రంథాలయాల పరిస్థితి అధ్వాన్నంగానే ఉంది. గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోగా, మునిసిపల్ కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇక ములుగు మండలంలో గ్రంథాలయ భవనం మాత్రం కొంత పర్వాలేదనిపించినా, వర్గల్ మండల కేంద్రంలో నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. రెండేళ్ల క్రితం రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొత్తగా ఏర్పడిన మర్కుక్ మండలంలో గ్రంథాలయ భవనం లేకపోవడంతో పోటీ పరీక్షల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపాక మండలంలోని గ్రంథాలయ భవనం మెయింటెనెన్స్ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం పోటీ పరీక్షల సమయం కావడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

పాత స్థలంలోనా.. కొత్త స్థలంలోనా...

గజ్వేల్‌లోని పాత మునిసిపల్ కార్యాలయం పక్కన గల గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అదే స్థలంలో గతంలో డిజిటల్ లైబ్రరీ నిర్మించేందుకు రూ.2కోట్లతో అంచనాలను తయారు చేయించిన ప్రభుత్వం ఆ తర్వాత ఆ విషయాన్నే మరచిపోయింది. మరోచోట ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా నిర్మాణం చేపడుతామని అధికారులు భావించారు. ముఖ్యంగా ఎడ్యుకేషన్ హబ్‌లకు చేరువలో గ్రంథాలయాలు నిర్మించేందుకు ప్రయత్నాలు చేసినప్పటికి అనువైనం స్థలం లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. ప్రస్తుతం ఉన్న స్థలంలోనైనా గ్రంథాలయాన్ని నిర్మిస్తే బాగుంటుందని పుస్తక ప్రేమికులు కోరుతున్నారు.



గజ్వేల్ పట్టణంలోని పాత మున్సిపల్ భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం

ఉపాధ్యాయులు చైతన్యవంతమైన

సమాజ నిర్మాతలు

- అన్ని గురుకులాలకు త్వరలో బెడ్స్
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఆగస్టు 28 : ఉపాధ్యాయులు చైతన్యవంతమైన సమాజ నిర్మాతలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గస్థాయి విద్యాశాఖ అధికారుల సమీక్షా సమావేశ నిర్వహించారు. ముందుగా నియోజకవర్గ విద్యాసంస్థల్లోని ఫలితాలు, సమస్యలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల పాఠశాలల్లో రూ. 11 వేల కోట్లతో మౌలిక వసతులను మెరుగుపరిచామన్నారు. శిశు కేంద్రీకృత విద్య కొనసాగాలన్నారు. రాష్ట్రంలో 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని వెల్లడించారు. కాలేజీలు, పాఠశాలలు, హాస్టళ్ల వారీగా సమస్యల వివరాలను ప్రభుత్వం సూచించిన 55 అంశాల ఫార్మెట్‌లో సేకరించి వాటిని డిప్యూటీ సీఎం నేతృత్వంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లకు త్వరలోనే బెడ్లు సరఫరా చేస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5 వేల కోట్లతో 30 నియోజకవర్గాల్లో 25 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత గురుకులాలను త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. కొడంగల్, వైరా తర్వాత హుస్నాబాద్‌లోనే ఏర్పాటు చేస్తామన్నారు. కోహెడ మండలం తంగళ్లపల్లిలో రూ.150కోట్లతో దీనిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచి 100 శాతం ఖర్చు చేస్తామన్నారు.

జాతీయ స్థాయిలో ఆడిన వారికి రూ.లక్ష

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై ఆటలు ఆడిన హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ. 50 వేలు, అదే జాతీయ స్థాయిలో ఆడిన విద్యార్థులకు లక్ష రూపాయలను తన వ్యక్తిగతంగా అందిస్తానని మంత్రి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడాదినోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కబడ్డీ, వాలీబాల్ ఆడారు. నియోజకవర్గంలో ఎక్కడ వ్యాయామ ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు.

తండాలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ

తండాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పట్టణంలో జరిగిన తీజ్ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బంజార మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. అలాగే జనగామ ప్రధానోపాధ్యాయుడు లావుడ్య కిషన్‌నాయక్ ఉద్యోగవిరమణ సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కిషన్ నాయక్ దంపతులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆర్డీవో రామ్మూర్తి, సిద్దిపేట, హన్మకొండ, కరీంనగర్ డీఈవోలు, హెచ్‌ఎంలు, నియోజకవర్గ క్రీడల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కేడం లింగమూర్తి, గిరిజన సంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.



తీజ్ ఉత్సవాల్లో పాల్గొని బంజార మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

ములుగు, ఆగస్టు 29: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య కోరారు. గురువారం ములుగు గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తామని సీఎం తెలిపారని, ఏమైనా సమస్యలుంటే చెప్పాలని ఆయన విద్యార్థులను కోరారు. బాత్‌రూంలు, ప్రహరీ, కిటికీలను ఏర్పాటు చేయాలని, వేసవికాలంలో నీటి కొరత లేకుండా చూడాలని విద్యార్థులు కోరారు. హాస్టల్లో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ పుష్పలత, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, వర్గల్ మాజీ జడ్పీటీసీ పోచయ్య నర్సింగరావు, ఎల్లంతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెంకటయ్య



సిద్దిపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రీసెర్చ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్

మెరుగైన సేవల కోసం

రీసెర్చ్ యూనిట్ ప్రారంభం

సిద్దిపేట టౌన్, ఆగస్టు29: ఢిల్లీలోని డీహెచ్‌ఆర్, ఐసీఎంఆర్ నిధులతో సిద్దిపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రోగులకు మరిన్ని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మల్టీడిసిప్లీనరీ రీసెర్చ్ యూనిట్‌ను గురువారం ప్రారంభించినట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్ తెలిపారు. మల్టీడిసిప్లీనరీ నిపుణుల బృందంతో కూడిన ఎంఆర్‌యూ అధ్యాపకులకు, విద్యార్థులకు వైద్య పరిశోధనలకు వేదికగా ఈ రీసెర్చ్ యూనిట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, నోడల్ అధికారి డాక్టర్ శైలజ, కమిటీ సభ్యుడు డాక్టర్. అశ్విన్‌దలాల్, శాస్త్రవేత్తలు డాక్టర్ కార్తీక్ భరద్వాజ్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, నిమ్స్ ప్రొఫెసర్లు డాక్టర్ కె. నాగమణి, మహేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 29 : నేటి విద్యార్థులకు మారుతున్న కాలానుగుణంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్గి ఉండాలని, అందుకు కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం గగన్‌యాన్- 3 భారతీ అంతరిక్ష పరిశోధన సంస్థ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హాజరు కాగా భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన సంస్థ చేస్తున్న ప్రయోగాలు వాటి వల్ల ఉపయోగాలు, భవిష్యత్తు తరాలకు ఏవిధంగా ఉపయోగపడుతాయనే అంశాలను విపులంగా వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నేటి విద్యార్థులు కేవలం పుస్తక నాలెడ్జి కాకుండా సాంకేతిక పరంగా వస్తున్న మార్పులను కూడా తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు సాంకేతికపరమైన అంశాలను తెలిపే అవకాశం తక్కువగా ఉంటుందని అందుకు కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ చేస్తున్న కృషి అమోఘమన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో శ్రద్ధగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, ప్రిన్సిపాల్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తకు మెమెంటో అందజేస్తున్న ఆర్డీవో

సెంట్రల్ జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి


ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : కంది మండల కేంద్రంలోని సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని బ్యారక్‌లు, గదులు, వంట గది, బాత్ రూమ్, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న కనీస అవసరాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.

తక్కువ ధరకే భూమి వస్తుందని వ్యాపారికి టోకరా

పెద్దశంకరంపేట, ఆగస్టు 29: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాజారాం తండా, ముకుంద్ తండాలకు చెందిన సాగర్‌చౌహాన్, దేవిదాస్, రమాకాంత్, వెంకట్, చందర్, జాదవ్‌లు ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి వరప్రసాద్‌ను తక్కువ ధరకే భూమి వస్తుందని చెప్పి మోసగించారు. ఉత్తులూరు శివారులో సాగులో ఉన్న భూమిని చూపించి, నిజాం సాగర్ బ్యాక్‌వాటర్‌లో ఉన్న భూమిని పట్టా చేయించారు. ఉత్తులూరు గ్రామానికి చెందిన రైతులు రాజిరెడ్డిగారి దుర్గయ్య, క్రిష్ణ, యాదగిరి, శంకర్‌కు చెందిన మూడు ఎకరాల భూమిని వరప్రసాద్‌కు అమ్మారు. తర్వాత వ్యాపారి భూమి వద్దకు రాగా.. ఈ భూమి మీదికాదు నాది అని అక్కడి రైతులు తెలుపగా మోసపోయానని గ్రహించాడు. వరప్రసాద్ పోలీసులను ఆశ్రయించారు. మధ్యవర్తులు ఆరుగురు నారాయణఖేడ్, కంగ్టి తదితర మండలాల్లో ఈ విధంగానే మోసం చేయగా వారిపై ఇప్పటికే కేసులు ఉన్నాయి. ఈ మేరకు పేట ఎస్‌ఐ శంకర్ కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

దారి దోపిడీ దొంగల ముఠాకు ఏడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : దారి దోపిడీకి పాల్పడుతున్న ఓ ముఠాకు చెందిన సభ్యులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ గురువారం తీర్పునిచ్చారని ఎస్పీ రూపేష్ తెలిపారు. వివరాల ప్రకారం... ఐడీఏ బొల్లారంకు చెందిన ఎస్.రామారావు(30), కె.దేవేందర్‌రావు(26), ఎండీ ఫిరోజ్(25), ఎస్.సంతోష్(23), జి.మోహన్(26), ఎం.సంజయ్‌కుమార్(25), జి.గణేష్(27) ఓ ముఠాగా ఏర్పడ్డారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన సంగమేశ్వర హెచ్‌పి గ్యాస్ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి 2016 మార్చి 5వ తేదీన గ్యాస్ కంపెనీకి సంబంధించిన రూ.6.28లక్షలు పటాన్‌చెరులోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జమ చేయడానికి వెళ్లాడు. అదే సమయంలో కారులో వచ్చిన నిందితులు విష్ణువర్ధన్‌రెడ్డిని బెదిరించి రూ.6.28 లక్షలను అపహరించుకుపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు పటాన్‌చెరు అప్పటి ఎస్‌హెచ్‌వో లింగేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకుని ఆధారాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు ఏడుగురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో పాటు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. కాగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులు, కోర్టు అధికారులను ఎస్పీ రూపేష్ అభినందించారు.

అత్యాచారం కేసులో నిందితునికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : మానసిక, శారీరక దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి గురువారం తీర్పు చెప్పారు. ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ జబ్బార్(19) 2018 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు మహ్మద్ జబ్బార్(19)కు జీవిత ఖైదు శిక్ష విధించడంతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ రూపేష్ అభినందించారు.

ఆయిల్‌పాం తోటను సందర్శించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

పుల్‌కల్, ఆగస్టు 29 : చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామ శివారులో రైతు కరణం హనుమంతరావు సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటను సంగుపేట ఏరువాక కేంద్రం సమన్వయ కర్త కె.రాహుల్‌విశ్వకర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త కె.సరిత గురువారం క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉద్యానవన శాఖ ప్రోత్సాహంతో రైతులు విరివిగా ఆయిల్‌పాం తోటలను సాగు చేస్తున్నారని, ఇందులో భాగంగానే సరాఫ్‌పల్లిలోనూ ఆయిల్‌పాం తోటను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. మొదటి ఏడాది మొక్కలను కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఈ పంటకు కొమ్ము పురుగు వ్యాప్తి చెంది నష్ట పరుస్తుందని, ఈ పురుగు తెల్లని అండాకారము గల గుడ్లు రెండు నుంచి అరుఅంగుళాలు కలిగి ఉంటుందన్నారు. లోతులో, తేమగల ప్రాంతాల్లో పడిపోయిన చెట్ల మొదళ్లలో పెట్టి సంతానాన్ని ఉత్పత్తి చేసుకుని, పెద్ద పురుగుల మొవ్వ ప్రాంతంలో వ్యాపించి చెట్టును నాశనం చేస్తుందన్నారు. దీని నివారణకు కొమ్ము పురుగును ఆకర్షించు రైనోల్యూర్ అను ఫెరమోన్ ఎరలు బకెట్లో పెట్టి ఐదెకరాల తోటకు ఒకటి చొప్పున ఉంచి, ఆకర్షితమైన తల్లి పురుగులను నాశనం చేయాలని సూచించారు. అదే విధంగా వేప పిండిని చెట్టు మొదళ్లలో చెట్టుకు వంద గ్రాములతో పాటు 150 గ్రాముల ఇసుకలో కలిపి చల్లాలన్నారు. తోట పరిసర ప్రాంతాల్లో పడిపోయిన చెట్లను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైపీఐ శ్రీకాంత్, రైతు కరణం హనుమంతరావు పాల్గొన్నారు.


ఆయిల్‌పాం తోటలో వ్యవసాయ శాస్త్రవేత్తలు

రైతుల ఆర్థిక స్వావలంబనకు నాబార్డు సహకారం

● డీడీఎం కృష్ణతేజ



కేవీకేలో మొక్కను నాటుతున్న నాబార్డు ప్రతినిధులు

జహీరాబాద్, ఆగస్టు 29 : రైతులు ఆర్థిక స్వాలంబన దిశగా వ్యవసాయం చేయాలని, అందుకు నాబార్డు సహకరిస్తుందని డీడీఎం కృష్ణతేజ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అల్గోల్-డిడిగి శివారులోని కేవీకేలో(కృషివిజ్ఞాన కేంద్రం)లో రైతు ఉత్పత్తిదారుల సంఘంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నిజామాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, సిద్దిపేట ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన 50 ఉత్పత్తిదారుల సంఘాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలు పండించడం మొదలుకుని మార్కెటింగ్ సదుపాయం కల్పించేవరకు వెన్నుదన్నుగ నిలవాలన్నారు. రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నామన్నారు. రైతులందరూ యూనిట్‌గా ఏర్పడి పండించిన ధాన్యానికి మద్దతు ధర వచ్చే వరకు విక్రయించకుంటే ఆశించిన ధర కచ్చితంగా వస్తుందన్నారు. పైగా రైతుల వద్దకే కొనుగోలుదారులు వస్తారన్నారు. రైతులు పంటలను పండించడంలో నూతన పద్ధతులను ఒంటబట్టించుకుని వ్యవసాయం చేయాలన్నారు. రసాయన ఎరువులను తక్కువ మోతాదుల్లో వాడుతూ సుస్థిర వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రైతులను సంఘటితం చేస్తూ సభ్యులుగా చేర్చుకుని లాభసాటి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీఏ బిక్షపతి, తదితరులు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వరప్రసాద్, శైలజ, ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

● పోలీసుల అదుపులో ఏడుగురు
● నాలుగు బైక్‌లు, 3 కేజీల గంజాయి పట్టివేత



గంజాయి విక్రయదారుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ సీఐ

జగదేవ్‌పూర్, ఆగస్టు 29 : జల్సాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో గంజాయిని విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నాలుగు బైకులు, మూడు కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. బుధవారం ఎస్ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో కలిసి జగదేవ్‌పూర్ సమీపంలోని కాలువ వద్ద పెట్రోలింగ్ చేస్తున్నాడు. ఆ సమయంలో మునిగడప గ్రామానికి చెందిన పల్లెపాటి వెంకటేష్ ద్విచక్ర వాహనాన్ని వదిలి పారిపోయాడు. ద్విచక్ర వాహనంలో కేజీ 300 గ్రాముల గంజాయి లభించింది. వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మరో యువకుడు జశ్వంత్ వద్ద కేజీ గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జశ్వంత్ చేర్యాల మండలం, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అరవింద్, ప్రేమ్‌రాజులకు గంజాయిని విక్రయించగా, బాలకిషన్, సంపత్ అనే ఇద్దరు యువకులు గంజాయి తాగుతూ పోలీసులకు కనిపించగా వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బాలాజీనగర్‌కు చెందిన కోహెడ వెంకటేష్, మునిగడపకు చెందిన పల్లెపాటి వెంకటేష్ ఇద్దరు భద్రాచలం నుంచి గంజాయిని తీసుకు వచ్చి గ్రామాలలో యువకులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఏడుగురు యువకుల నుంచి మూడు కేజీల గంజాయి, నాలుగు బైకులు, రూ.2000 నగదుతో పాటు నాలుగు మొబైల్‌ఫోన్‌లు పోలీసులు స్వాధీనం చేసుకుని ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ రమణారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్, తాజుద్దీన్, లింగం, శశికాంత్ తదితరులు ఉన్నారు.

బీహెచ్‌ఈఎల్ కార్మికుడి ఆత్మహత్య



అర్జున్‌రావు(ఫైల్)

రామచంద్రాపురం, ఆగస్టు 29 : భార్య దూరమడాన్ని భరించలేక బీహెచ్‌ఈఎల్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... సత్యహనుమా అర్జున్‌రావు(39) బెల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అర్జున్‌రావు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. 2015లో అర్జున్‌రావు వివాహం జరిగింది. కుటుంబంలోని చిన్నచిన్న తగాదాలతో భార్య విడాకులు తీసుకుంది. దీంతో అర్జున్‌రావు ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. రెండురోజుల క్రితం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్జున్‌రావు ఇంట్లోంచి వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు బద్దలు కొట్టుకుని ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతున్న అర్జున్‌రావు మృతదేహం కనిపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ పేర్కొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

● ఆరుగురిపై కేసు నమోదు

నంగునూరు, ఆగస్టు 29 : ప్రభుత్వం అనుమతి లేకుండా మట్టిని తవ్వి అక్రమ వ్యాపారం చేస్తున్న నాలుగు టిప్పర్లను, ఒక ఎక్స్‌కవేటర్, ఒక హిటాచిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాజగోపాలపేట పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్ తెలిపారు. నంగునూరు మండలం ముండ్రాయి శివారులో అక్రమంగా మట్టిని తవ్వి టిప్పర్లల్లో నింపుకుని దండ్ల కనకయ్య, బత్తుల అశోక్, బోదాస్ విష్ణు, శివరాత్రి మహేష్, దండ్ల మధు, రాంకుమార్ కలిసి తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు వాహనాలను పట్టుకుని సీజ్ చేయగా, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా తరలిస్తున్న మట్టి దందాపై ఆర్డీవోకు సమాచారం అందించినట్లు తెలిపారు.



పట్టుకున్న నిందితులను, టిప్పర్లను చూపిస్తున్న పోలీసులు

మర్పడగ క్షేత్రంలో ఘనంగా ఆర్ద్రా మహోత్సవం

కొండపాక, ఆగస్టు 29 : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గాసమేత సంతానమల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం ఆర్ద్రా మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ చెప్పెల హరినాథ్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి వచనంతో కార్యక్రమాలు ప్రారంభం కాగా రుద్రకలశ స్థాపన, నవగ్రహ, దిక్పాలక స్థాపన పూజ నిర్వహించారు. అనంతరం సంతాన మల్లికార్జునస్వామి వారికి మహాన్యాస పూర్వక విశేష పంచామృత అభిషేకం, అన్నపూజ, సంతాన పాశుపత అభిషేకం నిర్వహించారు. అనంతరం నవగ్రహహవనం జరిగింది. పూర్ణాహుతి పూర్తయిన తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



విజయదుర్గా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పూజలు

వేపచెట్టు అంజన్న సన్నిధికి వార్షికోత్సవ శోభ

కుకునూరుపల్లి, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని వేపచెట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి గ్రామ ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆలయ నిర్వాహక కమిటీ భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టింది. ముఖ్య అతిథులుగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాసం నవీన్‌కుమార్ హాజరయ్యారు.



విశేష అలంకరణలో అంజన్న

మారనున్న జహీరాబాద్ రూపురేఖలు

● ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్



కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్, ఆగస్టు 29 : నిమ్జ్, స్మార్ట్‌సిటీతో భవిష్యత్తులో జహీరాబాద్ రూపురేఖలు మారనున్నాయని ఎంపీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందనుందని, దీంతో ఈ ప్రాంతంలోని అందరికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తామయన్నారు. పేదింటి కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం దోహదపడుతుందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చెక్కుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, ఆర్డీవో రాజు, ఆయా మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు వాగుగడ్డ హనుమాన్ జాతర

ప్రతీ యేటా శ్రావణమాసం చివరి శనివారం ఉత్సవాలు.. ఏర్పాట్లు పూర్తి



ఏడిగడ్డకిష్టాపూర్ వాగుగడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

తొగుట, ఆగస్టు 29: మండలంలోని ఏటిగడ్డకిష్టాపూర్ వాగుగడ్డ హన్‌మాన్ ఆలయం జాతరకు ముస్తాబైంది. ప్రతీ ఏడాది శ్రావణమాసం చివరి శనివారం రోజున ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కూడవెల్లి వాగు పక్కనే చాలా ఏళ్ల క్రితం ఆలయం నిర్మాణం చేపట్టారు. ఇటీవల మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ఏటిగడ్డకిష్టాపూర్ ఊరు మొత్తం ముంపునకు గురైనప్పటికీ ఆలయం మాత్రం అలాగే ఉండటం గమనార్హం. ఈ ఆలయానికి వచ్చిన భక్తులు కూడవెల్లి వాగులో స్నానం చేసి దేవుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు చేస్తే కోరిన కోర్కెలు తప్పక నెరవేరుతాయని భక్తుల్లో అపార నమ్మకం. దాంతో ప్రతి ఏడు శ్రావణ మాసం చివరిరోజున ఆలయం వద్ద జాతర జరుపడంతో పాటు ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్‌లు, వాహనాలను తిప్పడంతో సందడి నెలకొంటుంది. హన్‌మాన్ జాతర కోసం గజ్వేల్, సిద్దిపేట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, కొండపాక మండలాల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయితీ తరఫున అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు దాతారు రవీందర్ తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసాభాస

● కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణుల పోటాపోటీ నినాదాలు
● మెదక్ జిల్లా హత్నూరలో ఉద్రిక్తత

హత్నూర, ఆగస్టు 29: మెదక్ జిల్లా హత్నూరలో గురువారం ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. హత్నూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన 197 మంది లబ్ధిదారులకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులతో కలిసి చెక్కులు పంపిణీ చేస్తున్నారు. అంతలోనే కొందరు బీఆర్‌ఎస్ నాయకులు స్టేజ్ పైకి ఎక్కడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు సునీతాలక్ష్మారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, బీఆర్‌ఎస్ జిందాబాద్ అంటూ ప్రతి నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పోలీసులు ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకుండా పోయింది. గందరగోళ పరిస్థితుల మధ్యనే సునీతాలక్ష్మారెడ్డి లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలలో రాజకీయాలకు తావివ్వకుండా ప్రోటోకాల్‌కు లోబడి పని చేయడం తమ అభిమతమని పేర్కొన్నారు. కొందరు కావాలనే రాజకీయాలు చేస్తూ రాద్ధాంతం చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీమ్, మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పెత్తనం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ మాట్లాడుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు సమాచారం ఇవ్వకుండా అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.



గందరగోళం మధ్య చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని భాష్యం విద్యామందిర్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుగు భాషా అక్షరాలతో కూర్చొన్నారు.

- వెల్దుర్తి

నాణ్యత పరిశీలించి సరుకులు తీసుకోవాలి

● మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీడబ్ల్యూవో లలిత, సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 29 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే సరుకులను నాణ్యతగా ఉన్నాయా లేదా పరిశీలించి తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకటి కరుణతో కలిసి జిల్లా అధికారులతో హైదరాబాద్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీతక్క మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే కోడిగుడ్లను టీచర్ పరిశీలించి తీసుకోవాలని, బాగాలేని వాటిని తిరిగి పంపించి మంచివి తెప్పించుకోవాలని సూచించారు. సీడీపీవోలు, డీడబ్ల్యూవోలు అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన కోడిగుడ్లను పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే సరుకులు నాణ్యమైనవి పరిమాణం తక్కువ కాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సెప్టెంబర్‌లో 30 రోజుల పాటు పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి డీడబ్ల్యూవో, సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో సీడీపీవోలు, కోఆర్డినేటర్లు, సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లకు పోషకాహార కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లల మీద ఎక్కువ దృష్టి సారించి పోషకాహారాన్ని అందించాలని డీడబ్ల్యూవో లలితకుమారి సూచించారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికారులంతా సిద్ధంగా ఉండాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ పార్థసారథి



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 29: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు.. పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది ఎంపిక, తుది ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పూర్తి చేయాలని, ఎప్పుడు నిర్వహించిన అధికారులంతా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ పార్థసారథి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి సచివాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి లోకేష్ కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్‌తో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 4-5 నెలల్లో స్థానిక ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా పంచాయతీ, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎలక్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల ఓటరు జాబితా తయారీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. మ్యాన్ పవర్ అధిక సంఖ్యలో అవసరం అవుతుందన్నారు. పోలింగ్ సిబ్బంది, బందోబస్తు కోసం పోలీస్ అధికారులు సైతం ఎక్కువ మొత్తంలో అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మండలాల్లో అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్లతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల నుంచి ఎంపిక చేసిన వారికి పోలింగ్ ప్రక్రియపై శిక్షణ ఇస్తామని తెలిపారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, ఎంపీవో, డీఎల్పీవో, డీపీవో అధికారుల పనితీరును అదనపు కలెక్టర్ తరచూ పర్యవేక్షించాలని, కలెక్టర్ మానిటరింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, ఆర్డీవో సదానందం, జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకీదేవి, డీఎల్పీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో అధునాతన హంగులతో డీసీసీబీ భవనం

● ప్రారంభోత్సవానికి సిద్ధం

నారాయణఖేడ్, ఆగస్టు 29 : నారాయణఖేడ్‌లో నాలుగు దశాబ్దాలుగా వాణిజ్య బ్యాంకులతో సమానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సేవలు అందుతున్నాయి. మొన్నటి వరకు బ్యాంకు కార్యకలాపాలు అద్దె భవనాల్లోనే కొనసాగాయి. ఈ ఇబ్బందులకు ఇక చెక్ పడనుంది. ఖేడ్‌లో అధునాతన హంగులతో రూ.కోటి వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఇది ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నది.

సహకార బ్యాంకు పరిధిలో దాదాపు ఆరు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. దీనికి తోడు స్వయం సహాయక బృందాలకు లింకే జీరుణాలు ఇస్తుండడంతో, ప్రస్తుతం ఉన్న భవనంలో ఖాతాదారులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో గత ప్రభుత్వ హయాంలో పాల శీథలీకరణ కేంద్రం ఆవరణలో రైతుబజార్ పక్కన దాదాపు 500 గజాల స్థలాన్ని కేటాయించింది. అధునాతన వసతులతో భవనాన్ని నిర్మించడానికి రూ.కోటి మంజూరు చేయడంతో, తొమ్మిది నెలల క్రితం పనులు ప్రారంభించి, యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తిచేశారు. ప్రస్తుతం భవనంలో ఇంటీరీయల్ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఫర్నిచర్‌ను సమకూర్చాలి. వారం రోజుల్లో ఈ పనులన్ని పూర్తి చేసి, భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



నిర్మాణం పూర్తయిన డీసీసీబీ భవనం

లాకర్ల వసతి.. ఏటీఎం సదుపాయం



నారాయణఖేడ్‌లో ఆధునిక హంగులతో బ్యాంకు భవనాన్ని నిర్మింపజేశాం. ఈ భవనంలో రైతులకు మహిళా సంఘాల వారికి, ఖాతాదారులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సేవలు అందిస్తాం. బ్యాంకులో లాకర్ల వసతితో పాటు ఏటీఎం, ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.

- వెంకటేశ్, బ్యాంకు మేనేజర్

తెలుగు భాషను విస్మరించొద్దు

● గిడుగు రామ్మూర్తి జయంతిలో వక్తలు

చేర్యాల, ఆగస్టు 29: తెలుగు భాషను విస్మరించవద్దని, తెలుగు వెలుగులు నింపాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూచించారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్, కడవేరుగు జడ్పీఎస్ఎస్‌తో పాటు కొమురవెల్లి జడ్పీఎస్ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేచరేణి జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులు తెలుగు కవులు వేషధారణతో భాషావతరాలు కార్యక్రమం చేపట్టారు.

● సిద్దిపేట కల్చరల్: గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం అధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి సంపత్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు దాసు, సంపత్‌కుమార్, శైలజ, రామస్వామి, నరేష్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల: వేచరేణి జడ్పీఎస్ఎస్‌లో తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు



సిద్దిపేట కల్చరల్: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

●వర్గల్: వర్గల్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో తెలుగు భాషా ఔనత్యాన్ని వివరిస్తూ పాటలు, ఉపన్యాసాలు, పద్యాలు, కవితలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, తెలుగు అధ్యాపకురాలు స్వాతి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విజయం

● క్రీడా దినోత్సవంలో అధికారులు, ఉపాధ్యాయులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు29: క్రమశిక్షణ, ఫిట్నెస్‌తోనే విజయాలు సాధిస్తామని, ప్రతీ క్రీడాకారుడికి గెలవాలన్న తపన ఉండాలని సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ డీవైఎస్‌వో జయదేవ్ ఆర్య క్రీడాకారులకు సూచించారు. హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ఫుట్‌బాల్ పోటీలను ప్రాంభించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో కార్యాలయ ఇన్‌చార్జి వెంకట్‌గౌడ్, కోచ్ అక్బర్, అసోసియేషన్ సభ్యులు హరిశ్, సాజిద్, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట రూరల్: నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మల్కంబ ఫోల్ గ్రామ యువకుల సహకరంతో ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో క్రాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వడ్డుపల్లి నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ సతీష్, ఉపాధ్యాయ బృందంతో పాటు గ్రామ యువకులు పోన్నాల బాబు, బాగన్న కరుణాకర్, రాజిరెడ్డి, రాజేష్, రాము, బిక్షపతి, సుధాకర్, రంజీత్, ప్రదీప్, అఖిల్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట రూరల్: మల్కంబ క్రీడలో విద్యార్థులు

● చేర్యాల: ధ్యాన్‌చంద్ జయంతిని చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అయిలయ్య, ఉపాధ్యాయులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నిరుపమ, పద్మ, అందె విజయ్‌కుమార్, మనోజ్, యాదగిరి, ప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడా సామగ్రిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, శ్రీనివాస్ గౌడ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లేశంగౌడ్, పరమేశ్వరాచారి, సంజయ్‌గుప్తా, కార్తీక్, అధ్యాపకులు ప్రకాశ్, రాజిరెడ్డి, లవకుమార్ ఉన్నారు.

● మర్కుక్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఎంపీయూపీఎస్ అంగడికిష్టాపూర్ పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, పాఠశాల చైర్మన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు హారిక, సంతోషిమాత, చిన్నికృష్ణ, నవీన, విద్యార్థులు ఉన్నారు.



సిద్దిపేట టౌన్: ఫుట్‌బాల్ క్రీడాకారులతో జయదేవ్ ఆర్య

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

● యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి

గజ్వేల్, ఆగస్టు 29: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది వేల కోట్లకి పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజ్‌రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. రాష్ట్రంలో మార్పు తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా విద్య రంగ సమస్యలపై దృష్టి పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలన్నారు. ధర్నా అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుడికందుల రవి, చంద్లపురం మధు, రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్, డివిజన్ నాయకులు వేముల ప్రవీణ్, తిమ్మాపురం యాదగిరి, సింగాటం రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నిధులు లేక.. నిలిచిన పీహెచ్‌సీ పనులు

● నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

రాయపోల్, ఆగస్టు 29: గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల అనారోగ్య సమస్యలను తీర్చడంతో పాటు పిల్లలకు వివిధ రకాల వ్యాక్సిన్‌లను వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో ఇస్తూ ఉంటారు. అలాంటి ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. రాయపోల్ మండలంలో ఐదు ప్రాథమిక ఉపకేంద్రాలు ఉండగా లింగారెడ్డిపల్లి కేంద్రానికి సొంత భవనం ఉంది. రాయపోల్, రాంసాగర్ కేంద్రాలకు కిరాయలేని అద్దె భవనాలు ఉన్నాయి. వడ్డెపల్లి కేంద్రానికి ఇటీవలే నిధులు మంజూరు కావడంతో టెండర్లు కూడా పూర్తయ్యాయి. పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అనాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి గతంలో రూ. 20లక్షలు మంజూరయ్యాయి. నాలుగు నెలల క్రితం 80 శాతం భవన నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా ఫ్లోరింగ్, విద్యుత్ ఫిట్టింగ్, పెయింటింగ్, ప్లంబింగ్, కిటికీలతో పాటు మరుగుదొడ్ల పనులు మిగిలి ఉన్నాయి. దీంతో గ్రామంలో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా నిధులు అయిపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.



అసంపూర్తిగా ఉన్న అనాజీపూర్ పీహెచ్‌సీ

నిధులు మంజూరు కాగానే పూర్తి చేస్తాం

అనాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం కోసం మంజూరైన నిధులు అయిపోయాయి. సుమారు మరో రూ. 5లక్షల నిధులు మంజూరు అయితే నిర్మాణ పనులు పూర్తవుతాయి. మంజూరు కాగానే నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం

- రామ్‌కుమార్, పీఆర్ఏఈ

ఎస్జీటీలందరూ ఒకే తాటిపైకి రావాలి

● ఎస్జీటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూదన్‌రావు



గౌరారం సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్జీటీలు

వర్గల్, ఆగస్టు 29: ఎస్జీటీల సమస్యల పరిష్కారం కోసం ఏకతాటిపై రావలని ఎస్జీటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదన్‌రావు పిలుపునిచ్చారు. వర్గల్ మండలం గౌరారంలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం వర్గల్ మండల ఎస్జీటీ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టులు మంజూరు చేయాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎస్జీటీల సమావేశం అనంతరం నిర్వహించిన మండల కమిటీ ఎన్నికల్లో వర్గల్ మండల ఎస్జీటీ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీరామ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మోహినోద్దిన్, కోశాధికారిగా మారుతి, ఉపాధ్యక్షులుగా వీణ, సంతోష్, శారద, నాగరాజు, కార్యదర్శులుగా శైలజ, రాజు, కోలను రాజు ఎన్నికైయ్యారు.

'ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటుహక్కును కల్పించాలి'

చేర్యాల, ఆగస్టు 29: ప్రభుత్వ పాఠశాలల్లోని ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటుహక్కు కల్పించాలని, ఈవిషయమై ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి అమలుచేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి కోరారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో గురువారం భోజన విరామ సమయంలో యూనియన్ సభ్యత్వాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మధ్యంతర భృతి, సీపీఎస్ రద్దు కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేస్తున్న యూనియన్ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మురళీధర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● మానుకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రమాణస్వీకారం చేస్తున్న ఏఎంసీ పాలకవర్గం సభ్యులు

బెజ్జంకి, ఆగస్టు 29: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకరణానికి గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో చైర్మన్‌గా పులి కృష్ణ, వైస్ చైర్మన్‌గా చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, పాలక వర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు అధైర్యపడవద్దని, వారి వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, పార్టీ మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, నాయకులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలి'

గజ్వేల్, ఆగస్టు 29: విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ధారం మల్లారెడ్డి రచించిన 'బాట ముచ్చట' పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏడెల్లి రాంచంద్రం పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో గురువారం పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31న సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న ఈ ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలన్నారు. ఆయనవెంట టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జిల్లా కౌన్సిలర్ పంబాల ఎల్లయ్య, మల్లయ్య, శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, పర్వతం నరసయ్య గోక విద్యాసాగర్, నాగరాజు, అనిల్ ఉన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు టెన్నికాయిట్ ఎంపిక పోటీలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 29: సిద్దిపేట జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న 14ఏళ్ల బాలబాలికల విభాగంలో జిల్లా స్థాయి క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, కార్యదర్శి క్యాతం రాజ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మల్టీపర్పస్ పాఠశాల మైదానంలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ఉంటాయని, క్రీడాకారులు 2010 సంవత్సరం తర్వాత జన్మించి ఉండాలని, కావున జన్మ ధ్రువపత్రం, బోనఫైడ్ ధ్రువ పత్రములతో హాజరుకావాలని కోరారు. ఎంపిక అయిన క్రీడాకారులు వచ్చే నెల 1 నుంచి 3 వరకు ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9440036878, 9393381627 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందజేత

సిద్దిపేట టౌన్, ఆగస్టు 29: అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న సిద్దిపేట జిల్లా క్రీడాకారిణి వైష్ణవికి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం గురువారం సిద్దిపేట పట్టణంలోని ఆయన కార్యాలయంలో రూ. 25వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 14 నుంచి 19 వరకు తైవాన్‌లోని తైపీలో జరిగే 4వ ఆసియా విశ్వవిద్యాలయాల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే భారత మహిళల జట్టుకు సిద్దిపేట జిల్లా క్రీడాకారిణి వైష్ణవి ఎంపికైనట్లు తెలిపారు. ఆమె ఇప్పటికే పలుమార్లు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, సిద్దిపేట జిల్లా, రాష్ట్ర జట్టుకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రేణుక, తోట సతీష్, హరికిషన్, శ్యాంసుందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటర్ల జాబితా

మద్దూరు, ఆగస్టు 29: వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నట్లు ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డీఎల్పీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒకే కుటుంబ సభ్యులు ఒకే వార్డులో ఉండే విధంగా చూస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒకే కుటుంబసభ్యులు వివిధ వార్డుల్లో ఉండేవారని, వారందరినీ ఒకే వార్డులో ఉండే విధంగా జాబితా రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వీరరాజ్‌తో పాటు పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కెడెట్లకు అభినందన

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 29: హైదరాబాద్ మెహదీపట్నంలోని ఆర్మీ అటాచ్‌మెంట్ శిబిరానికి హాజరైన సిద్దిపేట డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కెడెట్లను ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపక బృందం అభినందించారు. రాజవర్ధన్, నితిన్, నరేందర్, బాపురాజు, సునీల్, సాయికృష్ణకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన శిబిరంలో కవాతు, ఆయుధ శిక్షణ, క్రీడా పోటీలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు తరగతులు నిర్వహించారని ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, ఎగ్జామినేషన్ కంట్రోలర్ గోపాల సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల అందజేత

మిరుదొడ్డి, ఆగస్టు 29: అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు గురువారం సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి 30 జతల స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, లక్ష్మీనర్సింహులు, సుముకేశ్వర్‌రెడ్డి, జీవన్‌కుమార్, శ్యామల, ధనరాజ్ తదితరులున్నారు.

'పేదలకు భరోసా సీఎంఆర్ఎఫ్'

జగదేవ్‌పూర్, ఆగస్టు 29: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆర్థిక భరోసా ఇస్తున్నదని పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య పేర్కొన్నారు. తిగుల్‌కు చెందిన బొర్రోళ్ల సంతోష్ కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్, రాష్ట్ర ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. వారికి మంజూరైన రూ. 39000 వేల చెక్కును పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గర్నేపల్లి కోటయ్య అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్తయ్య, ఐలయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల మార్పు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను మార్చి బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో నారాయణఖేడ్ మండలంలో వివిధశాఖలకు చెందిన అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. కొన్నిశాఖల అధికారులు బదిలీలు కావడంతో వారి స్థానంలో కొత్త అధికారులను గ్రామ పంచాయతీలకు, ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

'ఎస్సీ విద్యార్థులకు అందని కేంద్ర ఉపకార వేతనం'

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 29: ఎస్సీ విద్యార్థులకు కేంద్ర ఉపకార వేతనాలు అందడం లేదని, మూడేళ్లలో సుమారు 750 కోట్లు దళిత విద్యార్థులు నష్టపోయారని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ పేర్కొన్నారు. డీహెచ్‌పీఎస్ సిద్దిపేట జిల్లా నిర్మాణ కౌన్సిల్ గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి వాటా నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే రాష్ట్ర వాటాను కలిపి విద్యార్థులకు బోధన ఫీజులు, ఉపకారవేతనాలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని అన్నారు. దీంతో విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ఫీజులు జమయ్యేలా నిబంధన మార్చేంత వరకు నిధులు ఇవ్వబోమంటూ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం నిలిపివేసిందన్నారు. ప్రభుత్వం దళిత విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, రామగుల్ల నరేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ బోనగిరి రూపేష్, బోనగిరి శంకర్, మిట్టపల్లి సుధాకర్, గుజ్జుక రమేష్, కార్తీక్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో డంపింగ్‌యార్డును పరిశీలించిన అధికారులు

గజ్వేల్, ఆగస్టు 29: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డంపింగ్ యార్డును గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా వ్యవసాయాధికారి రాధిక, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యలు పరిశీలించారు. డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ద్వారా వేరుచేస్తున్న వ్యర్థాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారితో కలసి పరిశీలించి, కంపోస్టు ఎరువును పరిశీలించారు. కంపోస్టు షాంపిల్స్‌ను పరిశీలించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు నివేదిక కోసం పంపించినట్లు కమిషనర్ తెలిపారు. వారివెంట మున్సిపల్ ఏఈ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

● ఏఈవోలు మాధవి, జ్యోతి

గజ్వేల్/మిరుదొడ్డి , ఆగస్టు 29: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని గజ్వేల్ మండల ఏఈవోలు మాధవి, జ్యోతి అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని బెజుగామలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి శివరాంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రైతు కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వివరాలను సేకరించారు. వ్యవసాయాధికారులు రైతులు సహకరించాలని కోరారు. రైతురుణమాఫీ కాని రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబసభ్యుల వివరాల సేకరణ చేస్తున్నామని మిరుదొడ్డి మండల వ్యవసాధికారి మల్లేశం తెలిపారు. మండలంలోని అల్వాలలో రుణమాఫీ కాని రైతుల ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు.

విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన

చిన్నకోడూరు, ఆగస్టు 29: భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం చిన్నకోడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల ఎఫ్‌పీవో రైతులకు ఆముదం, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటల విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసీఏఆర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 మంది రైతులకు భూసార పరీక్ష కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ శాస్రవేత్తలు జవహర్, మంజునాథ్, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులపై కుక్క దాడి.. సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనం

● ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి అభిషేక్ భాను

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 29: సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్‌పల్లి గ్రామ పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఓ కుక్క ముగ్గురు విద్యార్థులపై దాడి చేయడం సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గురుకుల హాస్టల్‌ను సందర్శించారు. అభిషేక్ భాను మాట్లాడుతూ.. ముగ్గురు విద్యార్థులను కుక్క కరిచిందని, హాస్టల్ ప్రహరీ సరిగా నిర్మించకపోవడం వల్లే కుక్కలు హాస్టల్లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. హాస్టల్ గేట్లకు, నేలకు మధ్య వ్యత్యాసం ఉండడం వల్ల కుక్కలు రావడానికి అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థులు రోగాల బారినపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏన్సాన్‌పల్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో వినయ్, నవదీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలోనే ఉన్న కుక్క

వీధి కుక్కల నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



గజ్వేల్ పట్టణంలో వీధి కుక్కలను పడుతున్న యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు

గజ్వేల్, ఆగస్టు 29: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని 1, 8, 9, 10వ వార్డుల్లో గురువారం యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణ కార్యాచరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుటుంబనియంత్రణ ఆపరేషన్ల నిర్వహిస్తామన్నారు. వారితో వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, కౌన్సిలర్లు రహీం, గంగిశెట్టి చందనరవి, మామిడి విద్యారాణి, శ్రీధర్, బొగ్గుల చందు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, నాయకులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

● కేజీబీవీని తనిఖీ చేసిన అధికారులు



కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

అక్కన్నపేట, ఆగస్టు 29: మెనూ ప్రకారం భోజనాలు అందించాలని నిర్వాహకులను అధికారులు ఆదేశించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ ఆశ్రమ పాఠశాలను గురువారం తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం, వైద్యాధికారి రమ్యలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలు, భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వంటలను, కూరగాయలను పరిశీలించారు. వారివెంట ఎంపీవో కవికుమార్, పంచాయతి కార్యదర్శి లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు.

వీరశైవలింగ బలిజ సమాజ అతిథిగృహం ప్రారంభం



అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైరపర్సన్ మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్, ఆగస్టు29: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు సిద్దిపేట పట్టణంలోని 35వ వార్డులోని వీరశైవలింగ బలిజ సమాజం అతిథిగృహాన్ని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ భూంపల్లి శ్రీలతశ్రీహరి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సమాజం అధ్యక్షుడు భద్రప్ప, సభ్యులు ప్రశాంత్, శివప్ప, యాదగిరి, నాగరాజు, రాజమౌళి, వీరేశం, కౌన్సిలర్ మల్లికార్జున్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్, మేర సత్తన్న, బీఆర్ఎస్ నాయకులు వజీర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం తలంబ్రాల పంపిణీ

వర్గల్, ఆగస్టు 29: భద్రాచలం సీతారామ కల్యాణానికి గోటితో వడ్లను వలచి తలంబ్రాలు చేసిన చాంద్‌ఖాన్ మక్త గ్రామస్థుల రామభక్తి అమోఘమని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు అన్నారు. వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్తా గ్రామంలో గురువారం గ్రామస్థులకు భద్రాచలం నుంచి వచ్చిన సీతారాముల తలంబ్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

● ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరి శంకర్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 29: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి ఆదరణ రోజురోజుకూ పెరుగుతున్నదని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● ములుగు: ములుగు మండలంలో అత్యధికంగా బీజేపీ సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాకే ఆదర్శంగా నిలవాలని జిల్లా ఇన్‌చార్జి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, ఉపాధ్యక్షులు కొండి నర్సింహులు, దుర్గం మహేష్ గౌడ్, కృష్ణ, మండల కన్వీనర్, కోకన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, మండల అధికార ప్రతినిధి గాడిపల్లి నర్సింహులు, మహిళామోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా భాగ్యలక్ష్మి, యువమోర్చా మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడు అనంగల కృష్ణ, కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడు పల్లె నవీన్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధారం గురువారెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ సభ్యత్వ నమోదులో ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ సభ్యత్వ నమోదు ప్రముఖ్‌గా నాయిని సందీప్, సహ ప్రముఖ్‌లుగా మాద్దూరి నరసింహ, వడ్డేపల్లి ప్రసాద్‌లకు బాధ్యతలు అప్పగించారు.

● హుస్నాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా సభ్యత్వ నమోదు కోకన్వీనర్ లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, హన్మకొండ జిల్లా కార్యదర్శి కుమారస్వామి, వీరమల్ల రవీందర్, బత్తుల శంకర్ బాబు, చిట్టి గోపాల్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, కందుల శ్రీనివాస్‌రెడ్డి, రామంచ మహేందర్‌రెడ్డి, చిరంజీవి, తోట స్వరూప, సతీష్, వీరాచారి, విద్యాసాగర్ తదితరులున్నారు.



ములుగు: లక్ష్మక్కపల్లి సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ